క్లుప్తంగా

కనకదుర్గ ఆలయంలో కమాండెంట్ పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పదవ పటాలంలో గల కనకదుర్గ ఆలయాన్ని కమాండెంట్ సాంబయ్య కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న పూజలకు కమాండెంట్ దంపతులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు సాంబశివరావు, రషీద్, ఆర్ఐలు రాజారావు, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, పటాలం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ధరూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని అల్వలపాడు శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచూరుకు చెందిన ఉలిగెప్ప, లక్ష్మి దంపతులు తమ బైక్‌పై గద్వాల జమ్ములమ్మ దర్శనానికి బయలుదేరారు. అల్వలపాడు శివారులో వ్యవసాయ పొలాల వైపు నుంచి ఓ వాహనం అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో బైక్‌పై ఉన్న ఉలిగెప్ప, లక్ష్మి అదుపు తప్పి కిందపడి గాయాలపాలయ్యారు. ఈ ఘటనపై బాధితులు రేవులపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఉండవెల్లి: ఇసుకను నదీతీరం నుంచి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మెన్నిపాడు శివారులోని తుంగభద్ర నది తీరం నుంచి బొలెరో వాహనంలో జల్లాపురం గ్రామానికి కృష్ణ ఇసుక తరలిస్తుండగా, పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు

కొత్తకోట రూరల్: అతివేగంతో వెళ్తున్న కారు వెనుక టైర్ పగిలిపోవడంతో కారు డివైడర్‌ను ఢీకొట్టగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట సమీపంలో ఎన్‌హెచ్ 44పై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు కర్నూల్‌లో బంధువుల పెళ్లి వేడుకల్లో పాల్గొని తిరిగి కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. కొత్తకోట సమీపంలోకి రాగానే కారు వెనుక టైర్ పగిలిపోవడంతో వేగంగా ఉన్న కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలుకొట్టింది. దీంతో కారులోని ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

లబ్ధిదారులకు న్యాయం చేయండి



అమరచింత: 18 నెలల కిందట ఇచ్చిన ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. గుడిసెలు వేసుకొని నివసిస్తున్న లబ్ధిదారులకు ప్లాట్‌ల హద్దులు చూపాలని సీపీఎం మండల కార్యదర్శి జీఎస్.గోపి, అజయ్, వెంకటేష్ డిమాండ్ చేశారు. దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించికుని అక్కడే జీవిస్తున్న లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బుచ్చన్న, అనంతమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి కృషి

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, తొమ్మిది రోజుల్లో ఫిర్యాదులన్ని పరిశీలిస్తామని తహసీల్దార్ రాజు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలనను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ తొమ్మిది రోజుల్లో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. భూ సమస్యలు, తప్పు ఒప్పులు, ఇతరాత్ర దరఖాస్తులన్నింటిని పరిశీలించి నివేదించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్ఐ జయమ్మ, ప్రసాద్, వరుణ్ పాల్గొన్నారు.



గ్రంథాలయాల్లో నిర్వహణ ఏది?



శాంతినగర్‌లో అంగన్‌వాడీ గదిలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

- అద్దె గదులు, పాఠశాలల్లో నిర్వహిస్తున్న వైనం
- విద్యుత్, వెంటిలేషన్ లేకపోవడంతో చీకట్లోనే గదులు

శాంతినగర్: విద్యా భాండాగారాలైన గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యార్థులు, పోటీపరీక్షలకు సిద్ధమయ్యే వారికి వాటి వల్ల పూర్తిస్థాయిలో ప్రయోజనాలు కలగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో నిర్వహిస్తున్న గ్రంథాలయాల్లో మౌలిక వసతులైన విద్యుత్, గాలి, వెలుతురు, ఫర్నీచర్ సరిగా లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక ఉన్నత చదువులు, గ్రూప్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండటంలేదని విద్యార్థులు వాపోతున్నారు. మండల కేంద్రాల్లో ఉండే గ్రంథాలయాల్లో పాఠకులకు తగినన్ని కుర్చీలు, బెంచీలు లేకపోవడం, వార్తా పత్రికలు, భక్తికి సంబంధించిన పుస్తకాలు లేవని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈవిషయమై జిల్లా గ్రంథాలయాల అధికారి, ప్రజా ప్రతినిధులు స్పందించి నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో పాఠకులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అద్దె గదులు, పాఠశాలల్లో నిర్వహణ

నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాలు అద్దె గదులు, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్న గదుల్లో ఉన్నాయి. ఆయా మండలాల్లో ఉన్నతపాఠశాలల ఆవరణలో, అంగన్‌వాడీ గదుల్లో గ్రంథాలయాలు నిర్వహిస్తున్నారు.

దాతలు ఇచ్చిన వాటితోనే సరి

విద్యాభిమానులైన దాతలు కొందరు అందజేసిన పుస్తకాలతోనే గ్రంథాలయాలు నడుస్తున్నాయని పాఠకులు విమర్శిస్తున్నారు. ఏటా విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వస్తున్నా పాత పుస్తకాలతోనే నిర్వహణ కొనసాగుతోందని పలువురు పెదవి విరుస్తున్నారు. గ్రంథాలయాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆధునిక విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

పదేళ్ల క్రితం పుస్తకాలు..



పదేళ్ల క్రితం నాటి పుస్తకాలతోపాటు దాతలు అందజేసిన పుస్తకాలు మాత్రమే గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. గ్రూప్స్, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించిన మెటీరియల్ అందుబాటులో లేవు. కొనాలంటే మావద్ద ఆర్థిక స్థోమత లేదు. కొత్తగా వచ్చిన మెటీరియల్ అందుబాటులో ఉంచాలి.

– అశోక్, ఇంటర్ విద్యార్థి, శాంతినగర్

పక్కా భవనం కావాలి..



గ్రంథాలయానికి సొంత భవనం ఉంటే బాగుంటుంది. అంగన్‌వాడీ గదిలో ఏర్పాటుచేశారు. ఎలాంటి సౌకర్యాలు లేవు. మాకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేవు. కొత్తగా వచ్చిన పాఠ్యపుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి.

– ఝాన్సి, పదో తరగతి విద్యార్థి, శాంతినగర్

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



గట్టులో అమరులకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గద్వాల అర్బన్: వర్గీకరణ కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించడమే అరమవీరులకు నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అశోక్, మోష, కన్న, తిమ్మన్న, దినేష్, రంజిత్, కురుమన్న తదితరులు ఉన్నారు.

గట్టు: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ముక్కెరయ్య, నర్సింహులు, గోపాల్, బస్వరాజు, వీరేష్, రాము, బాబు, రాజేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నరేష్, పురుషోత్తం, శివరాముడు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు



ధరూరు: మండలంలోని అల్వలపాడు శివారులోని తెలుగోనిపల్లి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు జెడ్పీ చైర్‌పర్సన్ సరిత హాజరయ్యారు. గురువారం రాత్రి ఆమె ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం రథం వద్దకు చేరుకుని పూజలు చేపట్టారు.

పోటీల్లో విజేతలు వీరే



అయిజ: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అంతర్రాష్ట్ర స్థాయిలో సందెపురాళ్లు, దొబ్బుడు గుండ్లు, ఇసుక సంచులు ఎత్తు పోటీల్లో విజేతలను ప్రకటించారు. సందెపు రాళ్లు ఎత్తు పోటీల్లో మిట్టదొడ్డికి చెందిన ఉరుకుంద ప్రథమ బహుమతి, రాయచూరుకు చెందిన నిజాం ద్వితీయ బహుమతి, మేడికొండకు చెందిన రాజు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. అదేవిధంగా దొబ్బుడు గుండు ఎత్తు పోటీల్లో వెంకటాపురం చెందిన లాల్‌భాషా ప్రథమ బహుమతి, రాయచూర్‌కు చెందిన పక్కీరప్ప ద్వితీయ బహుమతిని, వెంకటాపురానికి చెందిన షబ్బీర్ తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఇసుక సంచి ఎత్తు పోటీల్లో శారదపల్లికి చెందిన మరియప్ప ప్రథమ బహుమతిని, దేవదుర్గకు చెందిన పరశురాముడు ద్వితీయ బహుమతిని, అదే గ్రామానికి చెందిన సాంబన్న తృతీయ బహుమతిని, గెలుచుకున్నారు. విజేతలకు ఉత్సవ నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

గట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మూడవ రోజున మొత్తం 371 మందికిగాను 363 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ అధికారి కృష్ణవర్ధన్ తెలిపారు. పరీక్షా కేంద్రం బయట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



గట్టులో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్ బృందం సభ్యులు మదన్‌మోహన్, బాలకృష్ణ, శ్రీరాములు తనిఖీ చేశారు. మొత్తం 115 మంది విద్యార్థులకు 110 మంది విద్యార్థులు హజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

మానవపాడు: మండల కేంద్రంలో తహసీల్దార్ వహీదా ఖాతూన్, డాక్టర్ రిజ్వానా తన్వీర్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోలియో చుక్కలు 0–5 సంవత్సరాలు వారికి ఆదివారం నుంచి ప్రతి గ్రామంలో తప్పనిసరిగా వేయించాలని తెలిపారు. 32 బూత్‌లు, 138 మంది వ్యాక్సినేటర్లు అందిస్తారన్నారు. అనంతరం ఎంపీపీ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పల్స్‌పోలియోపై చర్చించారు. కార్యక్రమంలో డీటీ ధరణిషా, ఎంఈఓ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సూపర్‌వైజర్ చంద్రన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఎండుతున్న ప్రకృతివనాలు



ఎండుతున్న మొక్కలతో ఉమిత్యాలతండా పల్లె ప్రకృతి వనం

- మొక్కల నిర్వహణ గాలికి
- దృష్టి సారించకపోతే మరింత నష్టం

కేటీదొడ్డి: పల్లెప్రకృతి వనాలు పచ్చదనం కోల్పోతున్నాయి. సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవటంతో మొక్కలు ఎండిపోతున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు పల్లెప్రకృతి వనాలు నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో రూ.లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలు అక్కరకు రాకుండా పోతున్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ, దాతలు ఇచ్చిన భూములలో మొక్కలు నాటి వాటిని వనాలుగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. పల్లెప్రకృతి వనాల్లో అవసరమైన మొక్కలను ఆయా పంచాయతీలలో నర్సరీలు ఏర్పాటు చేసి పెంచారు. నర్సరీలు, పల్లెప్రకృతి వనాలలో మొక్కలకు నీరు అందించేందుకు ప్రతి పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. పల్లెప్రకృతి వనాలలోని మొక్కలను సంరక్షించకపోతే సర్పంచులు, కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని అప్పటి ప్రభుత్వం హెచ్చరికలు చేసింది. కొత్త పంచాయతీ రాజ్ చట్టంలో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను కూడా పాలకవర్గాలకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



నందిన్నె పల్లెప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

నిర్వహణపై నిర్లక్ష్యం

నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పర్యవేక్షణ మూడేళ్ల క్రితం వరకు సజావుగానే సాగింది. మండల, జిల్లా స్థాయి అధికారులు తరచూ పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాలలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచాయి. ఏడాది కాలంగా పల్లె ప్రకృతి వనాల నిర్వహణలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. మొక్కలకు నీళ్లు పట్టడం, కలుపు మొక్కలు తొలగించటం వంటి పనులను పంచాయతీల సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో చాలాచోట్ల మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు పంచాయతీల నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతున్నాయి. చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాలలోని మొక్కలను కూడా కొందరు నరికివేస్తున్నారు. అయినప్పటికీ పాలకవర్గాలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి.

పల్లెప్రకృతి వనాలను కాపాడుకోవాలి



పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాలను పరిరక్షించుకోవాలి. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి. పంచాయతీ పాలకవర్గాలు, అధికారులు పల్లెప్రకృతి వనాలపై దృష్టి పెట్టాలి. మొక్కలకు ఎండాకాలంలో నీరు పెట్టాలి.

– శ్రీపాదరెడ్డి, గువ్వలదిన్నె

చర్యలు తీసుకుంటాం

మొక్కల సంరక్షణకు రెండేళ్ల పాటు ఎన్ఆర్ఈజీఎస్‌లో కూలీలను కేటాయించారు. ఇప్పుడు పంచాయతీ సిబ్బందే మొక్కల సంరక్షణ బాధ్యతలు చూడాల్సి వస్తుంది. పారిశుద్ధ్య, ఇతర పనులతో పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పల్లె ప్రకృతి వనాలకు కేటాయించలేకపోతున్నారు. పంచాయతీ పాలకవర్గాల సమన్వయంతో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటాం.

– సయ్యద్‌ఖాన్, ఎంపీఓ, కేటీదొడ్డి

పనుల్లో నాణ్యత పాటించాలి

గద్వాల రూరల్: పట్టణంలోని చేపల మార్కెట్ నుంచి రాంనగర్ వరకు రహదారి అధ్వానంగా మారిన నేపథ్యంలో కొత్త బీటీ రోడ్డును నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ వేయాలని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. శుక్రవారం ఆయన చేపలమార్కెట్ ప్రాంతంలో బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళీ, కృష్ణ, వంశీ, రాము పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్

శ్రీశైలం బయలుదేరిన శివమాలధారులు



ఇరుముడితో బయలుదేరుతున్న శివమాలధారులు

రాజోళి: మండలం రోజులు పాటు శివ దీక్షలో ఉండి పూజలు ఆచరించిన శివమాలధారులు శుక్రవారం ఇరుముడితో శ్రీశైలం బయలుదేరారు. మండల కేంద్రంలో మాల ధరించిన భక్తులు స్థానిక భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం ఇరుముడిని తలపై ధరించారు. ఈ సందర్భంగా స్థానికులు శివభక్తులతో కలిసి భజనలతో, కీర్తనలతో పురవీధుల గుండా పొలిమేర వరకు వెళ్లి సాగనంపారు.

మతసామరస్యానికి ప్రతీక

మానవపాడు: హిందూ ముస్లింల ఐక్యతకు మత సమరస్యానికి ఇంతకంటే ప్రత్యేక నిదర్శం లేదని మండల కోఆప్షన్ మెంబర్ మహ్మద్ సిరాజ్ నిరూపించారు. మండలంలోని అమరవాయిలో శుక్రవారం మహ్మద్ సిరాజ్ నివాసంలో శివమాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది బిక్ష ఏర్పాటు చేస్తామని తెలిపారు. హిందూ, ముస్లింలు ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు.



అమరవాయిలో శివభక్తులతో మహ్మద్ సిరాజ్

గాలికుంటు నివారణ టీకాలు వేయించండి

శాంతినగర్: గేదెలు, ఆవులు, ఎద్దులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలని శాంతినగర్ పశుసంవర్ధకశాఖ డాక్టర్ పుష్పలత యజమానులకు సూచించారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో శుక్రవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల రైతులు, పశు పోషకులు ఉచితంగా అందజేస్తున్న టీకాలు పశువులకు తప్పకుండా వేయించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కొంకలలో 27 మంది రైతులకు చెందిన 583 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ వివరించారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, ఓఎస్ రవికిరణ్ పాల్గొన్నారు.



కొంకలలో కోడె దూడకు టీకా వేస్తున్న డాక్టర్ పుష్పలత

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూప రాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో, మండలంలోని ఎక్లాస్‌పురంలో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. పశువులకు వ్యాక్సిన్ వేయించాలనుకునేవారు పశువైద్యశాలో సిబ్బందిని సంప్రదించి, వివరాలు తెలియజేయాలని సూచించారు.

ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేరుస్తుంది

ఎర్రవల్లిచౌరస్తా: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని యాక్తాపురంలో, ఇటిక్యాల మండల కేంద్రంలో సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్ర ప్రజలు దొరల నిర్బంధంలో ఉన్నారన్నారు. కేసీఆర్ కుటుంబ యొక్క నిరంకుశ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడి, అరాచకాలు తప్పా ప్రజల జీవితాలు ఏమాత్రం మారలేదన్నారు. కుటుంబ పాలనతో 4సార్లు పేపర్ లీకేజీలు చేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఒక్క కుటుంబానికి కూడా రేషన్ కార్డు ఇచ్చిన చరిత్ర వారికి లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, భూములు ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే లభించిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మినందుకే అధికారం ఇచ్చి పట్టం కట్టారన్నారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్‌యాదవ్, రుక్మాందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, భాస్కర్, ప్రభాకర్, ఎల్కూరు శ్రీను, రాముడు, బజారి, అల్లబకాష్, యువరాజు తదితరులు ఉన్నారు.



ఇటిక్యాలలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న సంపత్‌కుమార్

గుంతలరోడ్డుపై శ్రమదానం

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడుకు చెందిన సుధాకర్‌గౌడ్ శుక్రవారం చిన్న తాండ్రపాడుకు వెళ్లే రోడ్డుపై మట్టిని వేసి, గుంతలు పూడ్చి శ్రమదానం చేశారు. చిన్నతాండ్రపాడు రోడ్డు బాగుచేయాలని పదేళ్లుగా ప్రజలు కోరుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో 8 గ్రామాల ప్రజలు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనేక సార్లు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడి అనేక మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇప్పటికే ఐదు సార్లు స్వచ్ఛందంగా రోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేసినట్లు ఆయన తెలిపారు.



గుంతలను పూడ్చుతున్న సుధాకర్‌గౌడ్

అలరించిన పద్య నాటకోత్సవాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన నిర్వాహకులు



నాటకంలో ఓ సన్నివేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండలో శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన పౌరాణిక నాటక ప్రదర్శనలు అలరించాయి. చంద్రముఖి కల్చరల్ అకాడమీ విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు, శ్రీరామాంజనేయ యుద్ధ ఘట్టం, మయసభ దుర్యోధన ఏకపాత్రాభినయం, శ్రీకృష్ణరాయబార నాటకం, కౌరవ సభ, కర్ణ రహస్యం, దేవేంద్రసభ నాటకాలను ప్రదర్శించారు. మండలి ప్రధాన కార్యదర్శి వి.నారాయణ శనివారం శ్రీకృష్ణరాయబారం, మైరావణ పూర్తి నాటకం, మాయల పకీరు ఏకపాత్రాభినయం, గయోపాఖ్యాన యుద్ధం నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు సురేందర్, వెంకటాచారి, వనజ, సీనియర్ సంగీత కళాకారులు సూర్యవర్ధన్‌రెడ్డి, రాజబాబు, ఎస్ఆర్ఎర్ ట్రస్ట్ చైర్మన్ రాంచందర్‌రావు పాల్గొన్నారు.

నేడు నాటక ప్రదర్శన

జనతా సేవా సమితి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మన్యంకొండ కోనేరు సమీపంలో శనివారం సాయంత్రం భద్రాద్రి రామదాస చరితమ్ భక్తినాటక ప్రదర్శన నిర్వహించనున్నారు. వరకవుల నరహరిరాజు రచన, సంగీతం దర్శకత్వంలో ప్రదర్శన ఉంటుందని, నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.